మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ఊరట

అరెస్టు చేయవద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామంలో, చేవెళ్ల మండలం ఎర్రవల్లిలో భూవివాదానికి సంబంధించిన కేసుల్లో ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులకు సోమవారం హైకోర్టులో ఊరట లభించింది. ఒకే వివాదంపై సివిల్ కేసుతోపాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేయాలనే కుట్రను జీవన్‌రెడ్డి న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. తమ కుటుంబానికి చెందిన 170 ఎకరాల్లో 93 ఎకరాలను మాత్రమే విక్రయించగా మిగిలిన భూమి తమదేనంటూ మాజీ ఎమ్మెల్యే, కుటుంబసభ్యులు బెదిరిస్తున్నారంటూ చైతన్య రిసార్ట్స్‌కు చెందిన సామ దామోదర్ రెడ్డి చేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టేయాలని కోరుతూ జీవన్‌రెడ్డి, ఆయన భార్య, తల్లి, సోదరుడు హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. దామోదర్‌రెడ్డి నుంచి తాము భూమిని కొనుగోలు చేశామని, ఆ భూమిపై తమకే హక్కులున్నాయన్నది వారి వాదన. చట్ట ప్రకారం కొనుగోలు చేసిన భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని దామోదర్‌రెడ్డి సివిల్ కోర్టులో దావా వేశారని. సమాంతరంగా అదే వ్యవహారంపై క్రిమినల్ కేసు వేసి అరెస్టు చేసే కుట్ర జరుగుతున్నదని చెప్పారు. ఒకే అభియోగంపై రెండు పోలీసుస్టేషన్లలో కేసులు పెట్టడం చట్టవ్యతిరేకమని ప్రకటించాలని, ఈలోగా పిటిషనర్లను అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. ఈ వాదనలను జస్టిస్ లక్ష్మణ్ ఆమోదించారు. పిటిషనర్లను పోలీసులు అరెస్టు చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను వాయిదా వేశారు.

కాంగ్రెస్ ఆశ నెరవేరలేదు: జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులతో తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపించారు. అక్రమ కేసులతో తనను అరెస్టు చేయాలనుకున్న కాంగ్రెస్ పార్టీ ఆశలు నెరవేరలేదని పేర్కొన్నారు. తనతోపాటు తన కుటుంబసభ్యులను అరెస్టు చేయవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లిలో 76 ఎకరాల భూమి విషయంలో తన కుటుంబంపై కేసులు మోపారని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

టీఎస్ పాలిసెట్‌లో బాలికలదే హవా

- టాపర్లుగా ఎంబైపీసీలో శ్రీనిఖ, ఎంపీసీలో హరీశ్
- మొత్తం 84శాతం ఉత్తీర్ణత

తుమటి హరీశ్

గోపగాని శ్రీనిఖ

ఎంపీసీ టాపర్లు

ర్యాంకు	పేరు	జిల్లా	మార్కులు
1	తుమటి హరీశ్	ఖమ్మం	120
2	కే లలిత్‌మనోహర్	రంగారెడ్డి	119
3	జీ భవిత	మహబూబ్‌నగర్	119
3	గోపగాని శ్రీనిఖ	సూర్యాపేట	119
5	నవ్యతి సుశాంత్	భద్రాద్రి కొత్తగూడెం	118
5	గోత్రాల అక్షర	కామారెడ్డి	118
5	ఎం ప్రియదర్శిని	మహబూబాబాద్	118

ఎంబైపీసీ స్టేట్ టాపర్లు

ర్యాంకు	పేరు	జిల్లా	మార్కులు
1	గోపగాని శ్రీనిఖ	సూర్యాపేట	119.5
2	సామ అఘవర్ధన్‌రెడ్డి	సూర్యాపేట	118
3	జీ భవిత	మహబూబ్‌నగర్	117.5
4	కట్ట హితేష్	జగిత్యాల	117
5	ముత్తోజు విష్ణువర్ధన్	హైదరాబాద్	117

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): టీఎస్ పాలిసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. సూర్యాపేట జిల్లాకు చెందిన గోపగాని శ్రీనిఖ ఎంబైపీసీ, ఖమ్మం జిల్లాకు చెందిన టీ హరీశ్ ఎంపీసీ విభాగంలో స్టేట్ టాపర్లుగా నిలిచారు. మే 24న ఈ పరీక్ష నిర్వహించగా, ఫలితాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక విద్యామండలి కార్యాలయంలో విడుదల చేశారు. మొత్తం 92,808 విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 82,809 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 69,728 (84.20శాతం) విద్యార్థులు అర్హత సాధించారు. బాలురు 46,319 మందికి 37,269 (80.47శాతం), బాలికలు 36,496 మందికిగాను 32,459 (88.94శాతం) క్వాలిఫై అయ్యారు. రెండు విభాగాల్లోనూ బాలికలే సత్తాచాటారు. ఎంపీసీలో 88.94, ఎంబైపీసీలో 88.30శాతం క్వాలిఫై కాగా, బాలురు ఎంపీసీలో 80.47, ఎంబైపీసీలో 77.90శాతం క్వాలిఫై అయ్యారు. వీరికి ర్యాంకుల ఆధారంగా ఇంజినీరింగ్ డిప్లొమాతో పాటు ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్, కొండా లక్ష్మణ్‌బాపూజీ హార్టికల్చర్, పీవీ నర్సింహారావు వెటర్నరీ వర్సిటీల్లోని డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. గోపగాని శ్రీనిఖ, జీ భవిత ఎంపీసీ, ఎంబైపీసీ రెండు విభాగాల్లోనూ సత్తాచాటి స్టేట్ టాపర్లుగా నిలిచారు. సాంకేతిక విద్యామండలి కార్యదర్శి పుల్లయ్య, సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ శ్రీనాథ్ సహా పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో118 పాలిటెక్నిక్ కాలేజీలు ఉండగా, ఈ ఏడాది షాద్‌నగర్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని ప్రారంభించనున్నారు.

రిజల్ట్ చూస్తే షాక్.. ఖాళీ ర్యాంకు కార్డు

పాలిసెట్ రాసినా ఫలితం రాలే

న్యాయంకోసం విద్యార్థి వేడుకోలు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) :పాలిసెట్ ఫలితాలు విడుదల చేశారని తెలుసుకొని..వెబ్‌సైట్ ద్వారా రిజల్ట్ చూడగానే ఖాళీ ర్యాంకుకార్డు దర్శనమిచ్చింది. దీంతో ఆ విద్యార్థి బిత్తరపోయాడు. పెద్దపల్లి జిల్లా కొలనూరుకు చెందిన విద్యార్థి మే 24న పాలిసెట్‌కు హాజరయ్యాడు. అధికారులు అతడికి 3111158 హాల్‌టికెట్ నంబర్ కేటాయించారు. ఆయా విద్యార్థి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కాలేజీ పరీక్షాకేంద్రంలో పరీక్షకు హాజరయ్యాడు. ఫలితాలొస్తాయి.. ఏదో కాలేజీలో సీటు వస్తుందన్న నమ్మకంతో ఫలితాలను పరిశీలిస్తే ఖాళీ ర్యాంకుకార్డుయే దర్శనమిచ్చింది. ఇదే విషయంపై ఉన్నతాధికారులను సంప్రదించినా ఫలితం లేదు. విద్యార్థి ఓఎమ్మార్ షీట్ గల్లంతయ్యిదా.. లేక ఏదైనా సాంకేతిక తప్పిదం జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు న్యాయం చేయాలని ఆ విద్యార్థి కోరుతున్నాడు.

గణితం, ఫిజిక్స్ టీచర్ల పంచాయితీకి ముగింపు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో భౌతికశాస్త్రం, గణితం టీచర్ల మధ్య పంచాయితీకి ముగింపు పలికేదిశలో సర్కారు కీలక నిర్ణయం తీసుకొన్నది. భౌతికశాస్త్రం టీచర్లు 6,7 తరగతులకు గణితం బోధించాలన్న నిర్ణయంలో కాస్త మార్పు చేయనున్నది. మధ్యే మార్గంగా ఎవరికి భారంకాకుండా మొత్తం పీరియడ్స్ సంఖ్యకు ఇరువురికి చెరోసగం చొప్పున సమానంగా పంచాలని నిర్ణయించింది. ఇది ఈ రెండు సబ్జెక్టు టీచర్లకు వర్తించనున్నది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు, మార్గదర్శకాలు త్వరలోనే విడుదలకానున్నాయి. ఇటీవ లే సర్కారు భౌతికశాస్త్రం టీచర్లు 6,7 తరగతుల్లో గణితం బోధించాలని ఆదేశించిన నిర్ణయించిన విషయం తెలిసిందే.

బడుల్లో ఫీజుల నియంత్రణకు ఎఫ్ఆర్‌సీ

సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు ఫైల్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు సర్కారు కీలక నిర్ణయం తీసుకొన్నది. ఐదుగురు సభ్యులతో కూడిన ఫీజు రెగ్యులేటరీ కమిటీ (ఎఫ్ఆర్‌సీ)ని నియమించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం.. సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదానికి పంపించారు. సీఎం నుంచి ఈ ఫైల్ నేరుగా మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని క్యాబినెట్ సబ్ కమిటీకి వెళ్తుంది. ఈ సబ్‌కమిటీ సిఫారసుల ఆధారంగా బిల్లును రూపొందించి అసెంబ్లీలో ప్రవేశపెడతారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకొంటారు. ఫీజులను నోటీసుబోర్డుపై ప్రదర్శించడంతో పాటు వెబ్‌సైట్‌లోను పొందుపరచాలన్న నిబంధనలను పొందుపరచనున్నట్టుగా తెలిసింది.

15 లోపు కొత్త వీసీల నియామకం

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 10 వర్సిటీలకు వీసీలను ఈ నెల 15లోపు నియమిస్తామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం తెలిపారు. సెర్చ్ కమిటీ సమావేశాలను ఆఫ్‌లైన్‌లో లేదా ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నట్టు పేర్కొన్నారు. సెర్చ్ కమిటీ సమావేశాలను మూడు రోజుల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నూతన వీసీల నియామకంపై చాన్స్‌లర్ అయిన గవర్నర్‌కు సమాచారాన్నిచ్చామని, ఇందుకు ఆయన కూడా సుముఖత వ్యక్తంచేశారని బుర్రా వెంకటేశం తెలిపారు.

ఎస్సీ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

హైదరాబాద్, జూన్3 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉచిత ఉద్యోగ, ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ ప్రాజెక్ట్ కో –ఆర్డినేటర్ సైదులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మూడు నెలల వ్యవధితో జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో, నాలుగు నెలల పాటు డయాలసిస్ టెక్నీషియన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని స్పష్టం చేశారు. 18నుంచి 35 ఏండ్ల వయసు ఉండి ఎస్ఎస్‌సీ చదివిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. అర్హులు, ఆసక్తి ఉన్న యువత 10లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 98485 81100, 90599 02355ను సంప్రదించాలని సూచించారు.

పరిశ్రమ, విద్యాసంస్థలతో రైల్వే గతిశక్తి ఒప్పందం

హైదరాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ): వడోదరలోని భారతీయ రైల్వే గతిశక్తి విశ్వవిద్యాలయం(జీఎస్‌వీ).. సోమవారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో నోకియా, ప్లాసర్ ఇండియా, జాకబ్ సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకొన్నది. పరిశ్రమ, విద్యాసంస్థల తో సహకారాన్ని పెంపొందించుకొనేందుకు జీఎస్‌వీ ఈ ఒప్పందాన్ని చేసుకొన్నది. జీఎస్‌వీ వైస్‌చాన్స్‌లర్ మనోజ్ చౌ రీ, నోకియా క్లౌడ్ అండ్ నెట్‌వర్క్ సర్వీసెస్ ప్రెసిడెంట్ రాఘవ్ సహగల్, ప్లాస ర్ ఇండియా ఎండీ సీగ్‌ఫ్రైడ్ ఫింక్, జాక బ్స్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెలాన్ కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

గురుకుల డిగ్రీ ప్రవేశ పరీక్ష ఫలితాలు రిలీజ్

హైదరాబాద్, జూన్3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి ఏప్రిల్ 28న నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు టీజీఆర్డీసీ సెట్ కన్వీనర్ సైదులు తెలిపారు. సీట్ల వివరాలను http s://tgrdcc et.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

చచ్చినా పింఛన్ ఆగలె!

3 నెలలుగా డబ్బులిచ్చినట్టు రికార్డులో నమోదు

కొల్లాపూర్, జూన్ 3 : ఆసరా పింఛన్ తీసుకునే వృద్ధుడు మృతి చెందినా.. అతడి పేరుపై పింఛన్ డబ్బులను తీసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. వివరాల్లోకెళ్తే.. కొల్లాపూర్ మండలం నార్లాపూర్‌కు చెందిన జీ లక్ష్మయ్య (63) ఈ ఏడాది ఫిబ్రవరి 7న మరణించాడు. అయితే, గ్రామపంచాయతీ పింఛన్ రిజిస్టర్‌లో లక్ష్మయ్య పేరుతో పింఛన్ డబ్బులు వచ్చినట్టు ఉండటంతో అనుమానంతో కుటుంబ సభ్యులు సోమవారం కొల్లాపూర్ ఎంపీడీవో ఆఫీసుకెళ్లి ఆరా తీశారు. మూడు నెలలుగా రూ.6 వేలు చనిపోయిన వ్యక్తి పేరుపై డబ్బులు డ్రా చేసిట్టు బయటపడింది. ఈ విషయం తెలిసి సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఈశ్వరయ్య వెంటనే మృతుడి కుమారుడు రాముడు ఫోన్‌కు పింఛన్ మొత్తాన్ని డిజిటల్ పేమెంట్ చేశారు. ఈ విషయమై వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. కార్యదర్శి ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

6 నుంచే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 6 నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 6 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం తెలిపారు. ఈ నెల 12న బడులు పున ః ప్రారంభమవుతాయని, విద్యార్థులకు ఒక యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలను అందిస్తామని చెప్పారు. ఆ రోజు రాష్ట్రంలోని ఎమ్మెల్యేలంతా విద్యార్థులకు యూనిఫారాలు, పుస్తకాలను పంపిణీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని చెప్పారు. ఇక ప్రభుత్వ బడుల్లో చేరడంతో ఒనగూరే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరిస్తామని పేర్కొన్నారు. సర్కారు బడుల్లో చేరడంతో ఫీజు లు మిగులుతాయని, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తామన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివిన వారికి ఇంజినీరింగ్ కోర్సుల్లో ఫీజు రాయితీ లభిస్తుందని వెల్లడించారు.

విద్యావలంటీర్లు లేనట్టే

టీచర్ల కొరత సమస్యను అధిగమించేందుకు ఈ ఏడాది విద్యావలంటీర్లను నియమించే అవకాశాలు కనిపించడంలేదు. ఈ నెల 12 నుంచి తరగతులు ప్రారంభంకానున్న నేపథ్యంలో పలు బడుల్లో టీచర్ల కొరత ఉందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. కానీ ప్రభుత్వ వర్గాలు మాత్రం ఈ వాదనను కొట్టిపారేస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే లక్షకు పైగా టీచర్లున్నారని, డీఎస్సీ ద్వారా మరో 11 వేల మందిని నియమించనున్నటూ చెప్తున్నాయి. ఇక డీఎస్సీ–2008 వారికి ఉద్యోగాలు కల్పించడంలో భాగంగా మూడు, నాలుగు నెలల్లో 3 వేల మందికి పోస్టింగ్స్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో 19 లక్షల మంది విద్యార్థులుండగా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి 10లోపే అవుతుందని ఇలాంటప్పుడు విద్యావలంటీర్ల అవసరం ఉండదని అధికారులు చెప్తున్నారు.

15 తర్వాతే లాసెట్ ఫలితాలు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన లాసెట్, పీజీలాసెట్ ఫలితాలు ఈ నెల 15 తర్వాత విడుదలకానున్నాయి. కొత్త వీసీల నియామకం తర్వాతే ఈ ఫలితాలను విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. లాసెట్, పీజీ లాసెట్ పరీక్షలను సోమవారం నిర్వహించారు. మొత్తం 79.45శాతం మంది అభ్యర్థులు హాజరైనట్టు సెట్ కన్వీనర్ బీ విజయలక్ష్మి తెలిపారు. లాసెట్ ఈ నెల 6న ప్రాథమిక కీ, రెస్పాన్స్‌షీట్లు విడుదల చేస్తారు.

టెట్ ప్రాథమిక కీ, రెస్పాన్స్‌షీట్ల విడుదల

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రాథమిక కీ, మాస్టర్ క్వశ్చన్‌పేపర్, రెస్పాన్స్‌షీట్లను https:// schooledu.telangana.gov. in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు తెలిపారు. కీపై అభ్యంతరాలను ఈ నెల 5 సాయంత్రం 5 గంటల వరకు తెలియజేయాలి.

'పది' అడ్వాన్స్‌డ్ పరీక్షలు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు మొదటిభాషకు పరీక్ష నిర్వహించారు. 16,215 మంది విద్యార్థులకు 14,041 (86.59%) విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు.

గ్రూప్–1 హాల్‌టికెట్‌పై తాజా పాస్‌ఫొటో

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : గ్రూప్ –1 పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు అలర్ట్. హాల్‌టికెట్‌పై తాజా పాస్‌ఫొటోను తప్పనిసరిగా అతికించాలి. 3నెలల లోపు దిగిన ఫొటో అయితే ఓకే. హాల్‌టికెట్‌పై అభ్యర్థి తన ఫొటోను అతికించకపోతే పరీక్షకు అనుమతించరని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ గుర్తుచేశారు. పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఒరిజినల్ ఐడీకార్డులను చూపిస్తే పరీక్షాకేంద్రం లోపలికి అనుమతిస్తామని తెలిపారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ముగిశాయి. మే 24 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు నిర్వహించారు. ఫెయిలైన విద్యార్థులకు మంగళ, బుధవారాల్లో ప్రాక్టికల్స్ జరుగుతాయి. ఈ నెలాఖరులో ఫలితాలను విడుదల చేస్తారు.

మూడో రైల్వే లైన్లకు పుష్కరకాలం

- కాజీపేట్ నుంచి బల్హార్షకు, విజయవాడకు మూడో లైన్లు
- నత్తనడకన నిర్మాణ పనులు
- విజయవాడకు 132.44 కి.మీ. పెండింగ్, బల్హార్షకు 9 ఏండ్లలో 131 కి.మీ. పనులే

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వేజోన్ పరిధిలోని కాజీపేట నుంచి అటు బల్హార్ష, ఇటు విజయవాడ లైన్లలో చేపట్టిన మూడో రైల్వేలైన్ల నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు కలిపి 421 కిలోమీటర్లకు కోసం మొత్తం రూ.4,015 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఇందులో కాజీపేట–విజయవాడ మూడో రైల్వే మార్గం కోసం 2012–13లో నిధులు కేటాయించారు. కాజీపేట–బల్హార్ష సెక్షన్ మూడో లైన్ ప్రాజెక్టు కోసం 2015–16లో మంజూరు చేశారు. నాటి నుంచి ఆయా మార్గాల్లో మూడో లైన్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతున్నది. ఒక అడుగు ముందుకు, నాలుగు అడుగులు వెనకకు అన్న చందంగా పనులు కొనసాగుతున్నాయి. అత్యంత రద్దీగా ఉండే కాజీపేట–బల్హార్ష, కాజీపేట–విజయవాడ మార్గాల్లో మూడో లైన్ ప్రాజెక్టు పనులు ముందుకు సాగడమే లేదు. సమాంతరంగా చేపట్టాల్సిన విద్యుద్దీకరణ పనులు కూడా సక్రమంగా జరగడం లేదు.

బల్హార్ష మార్గంలో పెండింగ్‌లో 51 కి.మీ. పనులు

కాజీపేట–బల్హార్ష సెక్షన్ మధ్యలో 202 కిలోమీటర్లు మేర మూడో రైల్వే లైన్ నిర్మించాల్సి ఉన్నది. అందులో తెలంగాణ ప్రాంతంలో 159 కిలోమీటర్లు, మహారాష్ట్ర పరిధిలో 43 కిలో మీటర్ల వరకు మూడో లైను, విద్యుద్దీకరణ పనులు పూర్తిచేయాలి. ఈ ప్రాజెక్టు కోసం 2015–16లో రూ.2,063 కోట్ల నిధులు కేటాయించారు. తొలుత 2020లో కేవలం 22.8 కిలోమీటర్ల మేరకు పూర్తి మూడో లైన్ పనులను పూర్తి చేశారు. అనంతర తొమ్మిదేండ్ల కాలంలో కేవలం 131 కిలోమీటర్లు మాత్రమే మూడో లైన్ పనులను పూర్తి చేసినట్టు రైల్వే అధికారుల ద్వారా తెలిసింది. ఈ సెక్షన్‌లో ఇంకా 51 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాలకు కలిపి ఇప్పటివరకు 150.96 కిలోమీటర్లు మాత్రమే ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేశారు. అందులో తెలంగాణ రాష్ట్రం పరిధిలో 114.96 కిలోమీటర్లు, మహారాష్ట్ర పరిధి 37 కిలోమీటర్ల మేర పూర్తి చేసినట్టు తెలిపారు.

సగమైనా పూర్తికాని విజయవాడ లైన్

కాజీపేట–విజయవాడ సెక్షన్ పరిధిలో మొత్తం 219 కిలోమీటర్ల వరకు మూడో రైల్వే లైన్, విద్యుద్దీకరణ ప్రాజెక్టు నిర్మాణానికి 2012–13లో మంజూరు చేశారు. అందుకోసం బడ్జెట్‌లో రూ.1,952 కోట్ల నిధులు కేటాయించారు. ఈ ప్రాజెక్టు మంజూరై ఇప్పటివరకు దాదాపు 12 సంవత్సరాలు పూర్తయింది. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఇప్పటి వరకు కేవలం 86.56 కిలోమీటర్ల మేరకే మూడో లైను, విద్యుద్దీకరణ పనులను పూర్తి చేశారు. ఇంకా 132.44 కిలోమీటర్ల మేర పనులను పూర్తి చేయాల్సి ఉన్నది. మిగతా పనుల పూర్తికి ఇంకా ఎంతకాలం పడుతుందో తెలియని అయోమయం నెలకొన్నది.

హరితహారం లక్ష్యం తగ్గింపు

- నాటే మొక్కల లక్ష్యాన్ని కుదించిన సర్కారు
- 20 కోట్ల నుంచి 13 కోట్లకు తగ్గింపు
- స్థలాల లభ్యత సమస్యగా మారిందన్న అటవీశాఖ

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): హరితహారం లక్ష్యాన్ని ఈ ఏడాది కుదించాలని రాష్ట్ర సర్కారు భావిస్తున్నది. ఏటా 19కోట్ల నుంచి 20కోట్ల మొక్కలు నాటుతుండగా, ఈ ఏడాది 13 కోట్ల మొక్కలు మాత్రమే నాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్క్‌ను చెరిపేయడానికి హరితహారం కార్యక్రమం పేరును కూడా మార్చడానికి ప్రభుత్వం సిద్ధమైంది. అటవీ శాఖ ఇప్పటికే కొన్ని పేర్లను సూచించగా, రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అధికారికంగా ప్రకటించనుంది. పక్షం రోజుల్లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉన్నట్లు అటవీశాఖ అధికార వర్గాల సమాచారం. గతేడాది 19.29 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోగా 30.29 కోట్ల మొక్కలు నాటారు. స్థలాల లభ్యత సవాలుగా మారిన నేపథ్యంలో మొక్కలు నాటే సంఖ్యను కుదించినట్లు నిర్ణయించినట్లు అటవీ శాఖ సీనియర్ అధికారి తెలిపారు. ఈ మేరకు జిల్లా స్థాయి కమిటీలు ఇప్పటికే ప్రతి పాదనలు అందించినట్లు సమాచారం. గతానికి భిన్నంగా ఈసారి అలంకార మొక్కల కంటే పెద్ద మొక్కలు నాటడంపైనే శాఖ దృష్టి సారించింది. ఫలాలను ఇచ్చే మొక్కలు, పీపాల్, వేప,రాష్ట్ర చెట్టు "జమ్మి చెట్టు" (ప్రోసోపిస్ సినారియా లిన్) విస్తృతంగా పెంచాలని నిర్ణయించినట్టు సమాచారం. 2015 జూలై 3న కేసీఆర్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇప్పటి వరకు రూ.10,822 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 273 కోట్ల మొక్కలు నాటించింది. మూడో అతిపెద్ద పర్యావరణ పరిరక్షణ ప్రయత్నంగా హరితహారం గుర్తింపు పొందింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పచ్చదనం 7.7శాతం పెరిగిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

రాష్ట్రంలో 8 విడతల్లో నాటిన మొక్కలు



బురఖాలో వచ్చిన నటి హేమకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నటి హేమ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి...

సంతృప్తికరంగా లేకపోవడంతో అరెస్ట్ చేసినట్టు పోలీసులు వెల్లడించారు. హేమ డ్రగ్స్ తీసుకున్నట్టు వైద్య పరీక్షల్లో తేలింది. గతంలో రెండుసార్లు నోటీసులు ఇవ్వగా హేమ విచారణకు హాజరు కాలేదు. దీంతో తాజాగా మరోసారి నోటీసులిచ్చి విచారణ చేశాక ఆమెను అరెస్ట్ చేశారు. రేవ్ పార్టీలో అసలు తాను పాల్గొనలేదని హేమ మొదట బుకాయించారు. అయితే ఆమె ప్రయాణించిన విమాన టికెట్లను పోలీసులు సాక్ష్యాలుగా చూపించడంతో విచారణ ఎదుర్కొనక తప్పలేదు. గత నెల 19న రేవ్‌పార్టీ జరిగిన స్థలంలో లభించిన డ్రగ్స్, పార్టీకి హాజరైనవారి రక్త నమూనాల పరీక్షల నివేదికల ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్